కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -149 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 11-06-2026 గురువారం పేజీలు : 4





## స్టీల్ ప్లాంట్ బాధితులకు
# 'కోటి' ఇవ్వాల్సిందే!

- కూటమి ప్రభుత్వంపై వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిప్పులు
- మా ప్రభుత్వం రాగానే బాధితులకు రూ.1 కోటి పరిహారం అందిస్తాం
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం, నెలకు రూ.50 వేల జీవన భృతి కల్పించాలి
- కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, పిల్లల చదువుల బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే
- విశాఖ ఆస్పత్రుల్లో బాధితులను పరామర్శించిన వైఎస్సార్‌సీపీ అధినేత

**విశాఖపట్నం (బిఎన్ఎస్):** విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ లో జరిగిన ఘోర ప్రమాద బాధితులను, మృతుల కుటుంబాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బుధవారం ప్రత్యక్షంగా పరామర్శించారు. విశాఖ పర్యటనకు విచ్చేసిన ఆయన.. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సెవెన్ హిల్స్, కిమ్స్ ఐకాన్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి, వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చి, వారికి పార్టీ తరపున ధైర్యం చెప్పారు.

ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడిన వైఎస్ జగన్.. చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రమాదం జరిగినప్పుడు బాధితులకు అండగా నిలవాల్సిన బాధ్యతను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. "కేంద్ర ప్రభుత్వ సంస్థ అంటూ నెపం నెట్టేసి చేతులు దులుపుకోవాలని చూడటం సమంజసం కాదు. ఏ సంస్థలో ప్రమాదం జరిగినా, నష్టపోయింది మన ఆంధ్రప్రదేశ్ బిడ్డలే అనే మానవతా దృక్పథం ప్రభుత్వానికి ఉండాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

మా ప్రభుత్వం రాగానే 'కోటి' ఇస్తాం..!

గతంలో తమ ప్రభుత్వ హయాంలో ఎల్జీ పాలిమర్స్ లాంటి ప్రమాదాలు జరిగినా గంటల వ్యవధిలోనే స్పందించి రూ. కోటి వరకు ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకున్న విషయాన్ని ఈ సందర్భంగా జగన్ గుర్తుచేశారు.

2 లో

# ఢిల్లీలో 'ఎన్డీఏ' ఘన విజయోత్సవం!

- ప్రధాని మోదీ 12 ఏళ్ల రికార్డుల పరిపాలనపై ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల హర్షం
- ఢిల్లీలో ఘనంగా ప్రధాని విందు రాజకీయాలు.. హాజరైన కూటమి నేతలు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- దేశ ప్రగతి, రాష్ట్రాల సమన్వయమే లక్ష్యంగా ముందుకు: ప్రధాని నరేంద్ర మోదీ






**న్యూఢిల్లీ (బిఎన్ఎస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుదీర్ఘ పరిపాలనలో మూడు అరుదైన రికార్డులు నమోదు చేసుకున్న శుభసందర్భాన్ని పురస్కరించుకుని దేశ రాజధాని ఢిల్లీలో ఎన్డీఏ పక్షాల నేతలకు ప్రధాని మోదీ ఘనంగా విందు ఇచ్చారు. 12 ఏళ్ల నిరంతర ప్రధాని ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుంటున్న తరుణంలో.. ఎన్డీఏ ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు మరియు కూటమి భాగస్వామ్య పక్షాల నేతలందరితో ఢిల్లీ వేదికగా ఈ ప్రత్యేక సమన్వయ భేటీ, విందు కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలో తెలుగు రాష్ట్రాల నుంచి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

**మోదీ ఖాతాలో మూడు అపూర్వ రికార్డులు**

నరేంద్ర మోదీ సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఎవరికీ సాధ్యంకాని మూడు ప్రధాన రికార్డులను సొంతం చేసుకున్నారు. వరుసగా మూడోసారి దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి రికార్డు సృష్టించడంతో పాటు, సుమారు 12 ఏళ్ల పాటు నిరంతరాయంగా దేశాన్ని ప్రగతి పథంలో నడిపించిన ఘనతను సాధించారు. దేశంలో స్థిరమైన, అవినీతి రహిత సుపరిపాలన అందించిన ఏకైక నాయకుడిగా మోదీ అరుదైన రికార్డు నమోదు చేసుకున్న తరుణంలో ఎన్డీఏ పక్షాలన్నీ కలిసి ఆయనకు ఘనంగా సత్కారం (సన్మానం) చేశాయి.

2 లో

# దేశంలో అతిపెద్ద డేటా సెంటర్
### చేతులు కలిపిన రిలయన్స్, మెటా



2 లో

**న్యూస్ డెస్క్,10 జూన్ (బిఎన్ఎస్):** భారతీయ సాంకేతిక రంగంలో ఒక భారీ ముందడుగు పడింది. సోషల్ మీడియా దిగ్గజం 'మెటా ప్లాట్‌ఫార్మ్స్', దేశీయ కార్పొరేట్ దిగ్గజం 'రిలయన్స్ ఇండస్ట్రీస్' సంయుక్తంగా గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఒక అత్యాధునిక ఏఐ-ఎనేబుల్డ్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించాయి.

# కేరళలోనూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
### ఆర్డినరీ సర్వీసులకు కేబినెట్ ఆమోదం

**న్యూస్ డెస్క్,10 జూన్ (బిఎన్ఎస్):** ఇటీవల పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఇచ్చిన హామీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కేరళలో యూడీఎఫ్ ప్రభుత్వం విజయం సాధించింది. దీంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు కేఎస్ఆర్టీసీ ఆర్డినరీ సర్వీసులకు కేబినెట్ ఆమోదం తెలిపినట్లు ముఖ్యమంత్రి వీడీ సతీషన్ ఈ రోజు ప్రకటించారు. ఈ మేరకు ప్రతి సంవత్సరం ఇందుకోసం రూ. 800 కోట్లు అవసరం పడతాయని సీఎం స్పష్టం చేశారు.


దీంతో కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల తరహాలోనే కేరళ ప్రభుత్వం కూడా మహిళలకు ఉచిత బస్సు




2 లో

ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిన రాష్ట్రాల్లో చేరింది.అయితే కేరళ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ కి చెందిన కేవలం ఆర్డినరీ బస్సు సర్వీసులలో ప్రాథమికంగా మహిళలకు ఉచిత ప్రయాణాన్ని కల్పించే ప్రతిపాదనకు కేరళ రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపినట్లు వి.డి. సతీశన్ మీడియాకు వెల్లడించారు.

# క్యూబాలో 150 ఏండ్లలోనే అత్యంత భారీ భూకంపం



2 లో

# విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాదం
### ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేష్



2 లో

**న్యూస్ డెస్క్,10 జూన్ (బిఎన్ఎస్):** విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో 8మంది చనిపోగా.. ఇవాళ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న మరొకరు ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం రోజు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌లు మృతుల కుటంబాలను పరామర్శించారు.ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.. బాధితులకు పరిహారం అందజేస్తామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మంత్రి లోకేష్ 24 గంటలు గడవకముందే మృతుల కుటుంబాలకు పరిహారం అందజేశారు. లోకేష్ ముందుగా తక్షణ పరిహారం కింద రూ. 25 లక్షల రూపాయలు అందజేస్తామని హామీ ఇచ్చారు.. చెప్పినట్లుగానే బాధిత కుటుంబ సభ్యులకు రూ. 25 లక్షల చెక్‌లు అందించారు.

# మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ

**న్యూస్ డెస్క్,10 జూన్ (బిఎన్ఎస్):** తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్, ఏఐసీసీ సీనియర్ నేత మీనాక్షి నటరాజన్‌కు మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల ప్రక్రియలో ఊహించని షాక్ తగిలింది. ఆమె దాఖలు చేసిన నామినేషన్ పత్రాన్ని స్క్రూటినీ అనంతరం రిటర్నింగ్ అధికారి మంగళవారం తిరస్కరించారు. తెలంగాణలో తనపై ఉన్న ఒక వివాదాస్పద కేసు వివరాలను, ఆస్తుల సమాచారాన్ని అఫిడవిట్‌లో మీనాక్షి నటరాజన్ ఉద్దేశపూర్వకంగా దాచారని ప్రతిపక్ష బీజేపీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ తిరస్కరణ దేశవ్యాప్తంగా రాజకీయ సంచలనంగా మారగా..



2 లో

నామినేషన్ రిజక్ట్ కావటానికి కారణమైన కేసు వివరాలు ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి.

వాస్తవానికి మీనాక్షి నటరాజన్‌పై ఎలాంటి ప్రత్యక్ష క్రిమినల్ నేరారోపణలు లేవు. కానీ న్యాయస్థానంలో దాఖలైన ఒక క్రిమినల్ పిటిషన్‌కు సంబంధించి ఆమెకు కోర్టు నుంచి సమన్లు జారీ అయ్యాయి. ఈ కేసు నేపథ్యం ఒక మహిళా వేధింపుల వివాదంతో ముడిపడి ఉంది. నారాయణపేట జిల్లా కాంగ్రెస్ నాయకుడు కుంభం శివకుమార్‌రెడ్డి ఒక మహిళను లైంగికంగా వేధించడంతో పాటు, చంపుతానని బెదిరించారనే ఆరోపణలపై గతంలో 2022లో పంజాగుట్టలో, 2023లో బెంగళూరులోని కుబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్ కూడా తిరస్కరణకు గురైంది.

బాధిత మహిళ నిందితుడైన శివకుమార్‌రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ పరంగా చర్యలు తీసుకోవాలని అప్పటి రాష్ట్ర ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ, ప్రస్తుత ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ప్రస్తుత మంత్రి వాకిటి శ్రీహరిల చుట్టూ తిరిగారు.

# ఢిల్లీలో ‘ఎన్డీఏ’ ఘన విజయోత్సవం!

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా కూటమి తరపున ఒక ప్రత్యేక అభినందన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

**విందులో ఏపీ సీఎం, డిప్యూటీ సీఎంల సందడి**

ఈ ప్రతిష్టాత్మక విందు రాజకీయంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లకు అత్యంత ప్రాధాన్యత దక్కింది. ప్రధాని మోదీని అభినందిస్తూ ప్రవేశపెట్టిన తీర్మానంలో చంద్రబాబు కీలక పాత్ర పోషించారు. కేంద్రంలో ఎన్డీఏ కూటమి బలానికి, దేశ సమగ్ర అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలతో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఏపీ అభివృద్ధి, అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు సహా రాష్ట్రానికి అందాల్సిన నిధులు, కేంద్ర సాయంపై ఈ సందర్భంగా ప్రాథమిక చర్చలు జరిగినట్లు సమాచారం.

**కూటమి ఐక్యత.. వికసిత భారత్ లక్ష్యం: ప్రధాని మోదీ**

విందు అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమాల ద్వారా స్పందిస్తూ.. “ఎన్డీఏ కుటుంబం అంటే కేవలం రాజకీయ కూటమి కాదు; సుపరిపాలన, దేశాభివృద్ధి, ప్రాంతీయ ఆకాంక్షల కలయిక” అని కొనియాడారు. ఎన్డీఏ పాలిత రాష్ట్రాల మధ్య మరింత సమన్వయం పెరగాలని, భవిష్యత్ రాజకీయ వ్యూహాలతో పాటు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగాలని ముఖ్యమంత్రులకు పిలుపునిచ్చారు. ‘వికసిత భారత్’ స్వప్నాన్ని సాకారం చేసేందుకు కూటమిలోని ప్రతి ఒక్కరూ మరింత వేగంగా శ్రమించాలని మోదీ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎన్డీఏ నేతలందరితో కలిసి ప్రధాని దిగిన గ్రూప్ ఫోటో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

## ఆగస్టు 8న హైదరాబాద్‌లో ఇండియా కూటమి భేటీ




**న్యూస్ డెస్క్,10 జూన్ (బిఎన్ఎస్):** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఈనెల 25 నుంచి ప్రారంభమయ్యే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ద్వారా పార్టీకి నష్టం వాటిల్లకుండా చూసేందుకు ఏఐసీసీ దృష్టిసారించింది. అందులో భాగంగా వచ్చే ఆగస్టు 8న హైదరాబాద్ లో జరగబోయే ఇండియా కూటమి సమావేశం పార్టీకి బూస్ట్ ఇవ్వనుందని నేతలు భావిస్తున్నారు. తాజాగా ఢిల్లీలో ఈనెల 8న సమావేశమైన ఇండియా కూటమి నేతలు అనేక కీలక అంశాలపై చర్చించారు. ఇటీవల దేశవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలపై 23 పార్టీలు నుంచి 35 మంది ప్రతినిధులు హాజరై చర్చించారు. అందులో ప్రధానంగా ఎస్ఐఆర్ పై గందరగోళం, ఓట్ల తొలగింపుపై చర్చ నడిచింది. మోసపూరిత ఎన్నికలపై సుప్రీంకోర్టు చీఫ్?జస్టిస్ కు లేఖ రాస్తామని ఏఐసీసీ చీఫ్?మల్లికార్జున ఖర్గే తెలిపారు. ఇండియా కూటమిలో భాగస్వామ్య పార్టీలు కాంగ్రెస్ తో కలిసి నడుస్తున్నాయి. ఇటీవల తమిళనాడులో మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ‘డీఎంకే’ కూటమి నుంచి వైదొలగింది. ‘ఆప్’ పంజాబ్ లో కాంగ్రెస్ కు ప్రత్యర్థిగా భావిస్తున్నందున ఆ పార్టీ సైతం కూటమికి దూరంగా ఉంటుంది.

ఎస్ఐఆర్ పై అభ్యంతరాలు : రాష్ట్రంలో జరగబోయే ఎస్ఐఆర్ ప్రక్రియపై తమకున్న అభ్యంతరాలను ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ వెల్లడించింది. ఈ మేరకు సీఈసీకి తమ అభ్యంతరాలు, సూచనలు, అభిప్రాయాలతో కూడిన వినతిపత్రాన్ని ఇటీవలే టీపీసీసీ చీఫ్? మహేశ్ కుమార్ గౌడ్ అందజేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియతో ఇటీవల ఎన్నికలు జరిగిన బెంగాల్ లో 90 లక్షలు ఓట్లను తొలగించడం ద్వారా ఫలితాలు తారుమారు అయ్యాయని ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను ఏడాది పాటు వాయిదా వేయాలని, ఓటరు వెరిఫికేషన్ ప్రక్రియకు కనీసం మూడు నెలల సమయం, బీఎల్ఓలు ప్రతి ఇంటిని కనీసం మూడు సార్లు సందర్శించాలన్న డిమాండ్లను ఇప్పటికే టీపీసీసీ ఈసీ ముందు పెట్టింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మరో రెండు వారాల్లో ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై ఆసక్తి నెలకొంది. ఇప్పటికే కాంగ్రెస్ బీఎల్ఏల నియామకం చేపట్టడంతో పాటు వారికి శిక్షణ కార్యక్రమాలను ట్రైనర్ ద్వారా అందిస్తున్నారు. సాంకేతిక, క్షేత్రస్థాయి విధివిధానాలపై సమగ్రమైన శిక్షణ, అవగాహన కల్పిస్తున్నారు.

త్వరలో ఎన్నికలు : ప్రతి రెండు నెలలకు ఒకసారి ఆయా రాష్ట్రాల్లో కూటమి సమావేశాలను నిర్వహించాలని ఇండియా కూటమి నేతలు నిర్ణయించారు. అందులో భాగంగానే హైదరాబాద్ లో భేటీ నిర్వహించాలని నిర్ణయించారు. ఇదిలా ఉండగా, గ్రేటర్ హైదరాబాద్, మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఐదారు నెలల్లో ఈ మూడు కార్పొరేషన్ల ఎన్నికలకు జరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో హైదరాబాద్ లో ప్రతిపక్ష పార్టీల అధినేతలు హాజరయ్యే సమావేశం కాంగ్రెస్ పార్టీకి మరింత బూస్ట్ ఇస్తుందన్న ఆశాభావంతో హస్తం నేతలు ఉన్నారు. దీంతో ఇండియా కూటమి సమావేశం, ఆ తర్వాత జరిగే పరిణామాలపైనా రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

## కేరళలోనూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
## ఆర్డినరీ సర్వీసులకు కేబినెట్ ఆమోదం

మొదటి పేజీ తరువాయి

ఈ పథకం ద్వారా కేరళలోని లక్షలాది మంది మహిళలకు, ముఖ్యంగా నిరుపేద, ఉద్యోగ, కార్మిక మహిళలకు ఎంతో ఆర్థిక ఉపశమనం కలగనుంది. అయితే, ఈ పథకాన్ని కేవలం ఆర్డినరీ బస్సులకే పరిమితం చేయకుండా.. ఇతర సర్వీసులకు కూడా విస్తరించాలని, అలాగే ఇప్పటికే తీవ్ర నష్టాల్లో ఉన్న కేఎస్ఆర్టీసీని గట్టెక్కించేందుకు ప్రభుత్వం ఎలాంటి నిధులు కేటాయిస్తుందనే దానిపై విపక్ష నేత వి.డి. సతీశన్ అసెంబ్లీ వేదికగా మీడియా ద్వారా చర్చ లేవనెత్తారు. దీనిపై ప్రభుత్వం నుంచి అధికారిక జీవో త్వరలోనే విడుదల కానుంది.

## క్షమాపణలు చెప్పిన తర్వాతే జగన్ బెంగళూరు వెళ్లాలి: మంత్రి నారా లోకేశ్ డిమాండ్



**న్యూస్ డెస్క్,10 జూన్ (బిఎన్ఎస్):** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన అగ్నిప్రమాదం లో మొత్తం 9 మంది మృతి చెందారు. మరో ఐదుగురిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రస్తుతం క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. మరోవైపు ఈ ఘటన రాజకీయ దుమారం రేపింది. బాధితులను పరామర్శించి ఈ ఘటనకు కారణం తమరంటే తమరని వైసీపీ, టీడీపీ నేతలు పరస్పరం విమర్శలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి కి మంత్రి నారా లోకేశ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. విశాఖ ఉక్కును తాము రెండుసార్లు కాపాడామని, అది తమ చరిత్ర అని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. విశాఖ ఉక్కును గత ప్రభుత్వంలో జగన్ విధ్వంసం సృష్టించిందని, మూడో రాజధాని అంటూ భూములు కొట్టేయాలని యత్నించారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ వల్ల కాలుష్యం అంటూ కార్మికుల జీవితాలతో చెలగాటమాడారని మండిపడ్డారు., స్టీల్ ప్లాంట్ కార్మికులకు క్షమాపణ చెప్పి ఆ తర్వాత జగన్ బెంగళూరు వెళ్లాలని మంత్రి లోకేశ్ డిమాండ్ చేశారు.

## మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ

మొదటి పేజీ తరువాయి



శివకుమార్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేశామని మీనాక్షి నటరాజన్ చెప్పినప్పటికీ.. దానికి సంబంధించిన ధ్రువపత్రాన్ని ఇవ్వడానికి నిరాకరించారని సదరు మహిళ ఆరోపించారు. పైగా.. బెయిల్ రద్దయిన నిందితుడిని పార్టీ కౌంటింగ్ ఏజెంట్‌గా నియమించారని, నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డితో కలిసి ఆయన ఒక అధికారిక కార్యక్రమంలో పాల్గొన్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

పార్టీ పరంగా తనకు న్యాయం జరగకపోవడంతో బాధితురాలు గత ఏడాది ఆగస్టు 28న హైదరాబాద్‌లోని నాల్గవ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నిందితుడిపై చర్యలు తీసుకోనందుకు గాను మీనాక్షి నటరాజన్, మహేష్‌కుమార్ గౌడ్, మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే పర్ణికరెడ్డి సహా పలువురు కాంగ్రెస్ నేతలపై చర్యలు తీసుకోవాలని తనకు రూ.10 కోట్ల నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ ప్రైవేట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని పరిశీలించిన న్యాయస్థానం.. మీనాక్షి నటరాజన్‌తో పాటు ఇతరులకు సమన్లు జారీ చేసింది. రాజ్యసభ నామినేషన్ అఫిడవిట్‌లో ఈ కోర్టు సమన్ల సమాచారాన్ని పేర్కొనకపోవటమే నామినేషన్ తిరస్కరణకు ప్రధాన కారణమైంది.

ఈ వ్యవహారంపై టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ స్పందిస్తూ.. కాంగ్రెస్ ఓటమికి భయపడి బీజేపీ కుట్రపూరితంగా ఈ పని చేయించిందన్నారు. నోటీసు ఇస్తే సమాధానం ఇచ్చేవాళ్లమని ఈ విషయాన్ని కోర్టులోనే తేల్చుకుంటామని స్పష్టం చేశారు. ఇలా ప్రత్యక్షంగా ఏ కేసులో లేకుండానే మీనాక్షి నటరాజన్ నామినేషన్ రిజెక్ట్ అయింది. ఆమె ఎంపీ స్థానానికే ఎసరు పెట్టింది. పాపం మీనాక్షి నటరాజన్ పదవి వచ్చినట్లే వచ్చి తృటిలో చేజారిపోయింది.

# విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాదం

## మృతుల కుటుంబాలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేష్

మొదటి పేజీ తరువాయి



విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రమాదంలో చనిపోయిన మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షలు, క్షతగాత్రులకు రూ. 10 లక్షలు పరిహారం అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అలాగే మృతిచెందిన ఒక్కో రెగ్యులర్ ఉద్యోగి కుటుంబానికి అన్ని ప్రయోజనాలు కలుపుకొని రూ. 1.72 కోట్లు, ఒప్పంద ఉద్యోగికి రూ. 45 లక్షల పరిహారం అందుతుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. అంతేకాదు ఈ ప్రమాదంలో చనిపోయిన కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇస్తామని ప్రకటించారు. అలాగే ఆ కుటుంబాల్లో పిల్లలు ఉంటే వారిని చదివించే బాధ్యత తీసుకుంటామన్నారు. చనిపోయినవారు ఒప్పంద ఉద్యోగులైనా, శాశ్వత ఉద్యోగులైనా కుటుంబ సభ్యుల్లో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పిస్తామన్నారు.

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రమాదంలో మరొకరు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి సంఖ్య 9కి చేరింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పైడిరా ఇవాళ ఉదయం చనిపోయినట్లు అధికారులు తెలిపారు. ఇటు స్టీల్‌ప్లాంట్ ప్రమాదానికి కారణాలపై విచారణ చేసేందుకు కేంద్ర ఉక్కుశాఖ త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ త్రిసభ్య కమిటీలో బొకారో సెయిల్ డైరెక్టర్ ఇన్‌ఛార్జి ప్రియరంజన్, సెయిల్ చీఫ్ జనరల్ మేనేజర్ జితేంద్రకుమార్, సెయిల్ విశ్రాంత సీజీఎం గోపాల్‌సింగ్ ఉన్నారు. ఈ కమిటీ ప్రమాద స్థలాన్ని పరిశీలించింది.. మరో రెండు రోజుల పాటూ విశాఖపట్నంలోనే ఉండి ప్రమాదన కారణాలపై ఆరా తీయనుంది.

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన ప్రమాదం కారణంగా దాదాపు రూ. 120 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. రెండు రోజుల పాటూ రోజుకు 8వేల టన్నుల చొప్పున ఉత్పత్తి నిలిచిపోయింది.. దీని వల్ల రూ. 100 కోట్లు నష్టం ఉంటుందంటున్నారు. యంత్రాలు, మిగిలిన సామాగ్రి నష్టం రూ. 20 కోట్ల వరకు ఉంటుందని చెబుతున్నారు. ప్రస్తుతం ఉక్కు పరిశ్రమలోని ఎస్ఎంఎస్-1లో మిషన్2 ఆగిపోయింది.. మిగిలిని ఐదు మిషన్లతో పనిచేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

# స్టీల్ ప్లాంట్ బాధితులకు ‘కోటి’ ఇవ్వాల్సిందే!



మొదటి పేజీ తరువాయి

ప్రస్తుత కూటమి ప్రభుత్వం మృతుల కుటుంబాలకు ఇచ్చే పరిహారంలో పెద్ద డ్రామాలు ఆడుతోందని, స్టీల్‌ప్లాంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఇచ్చే రూ.25 లక్షలను తామే ఇస్తున్నట్లు చూపిస్తోందని విమర్శించారు. ఒకవేళ చంద్రబాబు ప్రభుత్వం బాధిత కుటుంబాలకు రూ. 1 కోటి పరిహారం ఇవ్వకపోతే, రాబోయే రోజుల్లో మళ్లీ తమ ప్రభుత్వం ఏర్పడగానే బాధిత కుటుంబాలకు రూ. కోటి పరిహారం అందించి ఆదుకుంటామని జగన్ ఘనంగా ప్రకటించారు.

జగన్ డిమాండ్లు ఇవే:

మృతి చెందిన ప్రతి కార్మికుడి కుటుంబానికి ప్రభుత్వం తరపున తక్షణమే రూ. కోటి నష్టపరిహారం చెల్లించాలి.

బాధిత కుటుంబాల్లోని అర్హులైన ఒక వ్యక్తికి స్టీల్ ప్లాంట్‌లో గానీ, లేదా ప్రభుత్వ పరంగా గానీ శాశ్వత ఉద్యోగ అవకాశం కల్పించాలి.

వారి పిల్లల చదువుల బాధ్యతను పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి.

గాయపడిన కార్మికులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు ఉచితంగా అందించడంతో పాటు, వారు పూర్తిగా కోలుకునే వరకు నెలకు రూ. 50 వేల జీవన భృతి కల్పించాలి.

ఉక్కు పరిశ్రమను భ్రష్టు పట్టిస్తున్నారు..!!

రక్షణ లోపాలు, నిర్వహణ లోపాల వల్లే ఈ దారుణమైన ప్రమాదం జరిగిందని జగన్ ఆరోపించారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారం నుంచి దిగిపోయే నాటికి స్టీల్ ప్లాంట్‌లో 28 వేల మంది ఉద్యోగులు ఉంటే.. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉద్యోగులను తొలగించి కేవలం 16 వేల మందికే పరిమితం చేశారన్నారు. మిగిలిన కార్మికులపై పనిభారం పెంచడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని, ఉద్యోగుల క్వార్టర్స్‌లో కరెంట్ బిల్లుల చార్జీలను భారీగా పెంచేసి, బోనస్‌లు, ఇన్సెంటివ్‌లు ఆపేసి కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను తమ ప్రభుత్వం అడ్డుకుందని, బాధితులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ తరపున పోరాటం ఆపేది లేదని జగన్ స్పష్టం చేశారు.

# దేశంలో అతిపెద్ద డేటా సెంటర్...చేతులు కలిపిన రిలయన్స్, మెటా

మొదటి పేజీ తరువాయి



మెటా సంస్థ భారతదేశంలో ఏర్పాటు చేయబోతున్న మొట్టమొదటి ఏఐ డేటా సెంటర్ ఇదే కావడం గమనార్హం. ఈ ఒప్పందంలో భాగంగా, రిలయన్స్ ఇండస్ట్రీస్ జామ్‌నగర్‌లో అధునాతన మౌలిక సదుపాయాలతో కూడిన డేటా సెంటర్‌ను నిర్మించగా, మొదటి దశలో 168 మెగావాట్ల సామర్థ్యం గల ఈ కేంద్రాన్ని మెటా పూర్తిగా లీజుకు తీసుకోనుంది. భవిష్యత్తులో అవసరాలకు అనుగుణంగా దీని సామర్థ్యాన్ని మరింత పెంచుకునేలా ఇరు సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. రాబోయే రెండేళ్ల కాలంలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

గ్రీన్ ఎనర్జీ.. సముద్రపు నీటితో కూలింగ్

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఈ ప్రాజెక్ట్‌ను పూర్తిగా గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో రూపకల్పన చేస్తున్నారు. ఈ డేటా సెంటర్ నిర్వహణకు అవసరమైన విద్యుత్‌ను 100% గ్రీన్ ఎనర్జీ ద్వారానే అందిస్తారు. అంతేకాకుండా, సర్వర్ల కూలింగ్ ప్రక్రియ కోసం భూగర్భ జలాలను వాడకుండా, సముద్రపు నీటిని శుద్ధి చేసే అత్యాధునిక సాంకేతికతను ఇక్కడ ఉపయోగించనున్నారు.

భారతీయ వినియోగదారులకు సూపర్ స్పీడ్ సర్వీసెస్

భారత్‌లో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లకు కోట్లాది మంది వినియోగదారులు ఉన్నారు. ఈ డేటా సెంటర్ అందుబాటులోకి వస్తే, భారతీయ యూజర్ల డేటా స్థానికంగానే ప్రాసెస్ అవుతుంది. దీనివల్ల ల్యాటెన్సీ తగ్గి, మెటా ఏఐ ఫీచర్లు, రీల్స్, వాయిస్ అసిస్టెంట్ సేవలు అత్యంత వేగంగా అందుతాయి. అలాగే భారత ప్రభుత్వ ‘డేటా లోకలైజేషన్’ చట్టాలకు అనుగుణంగా యూజర్ల డేటా భద్రత మరింత పటిష్టం కానుంది. జియో, మెటా భాగస్వామ్యంలో రాబోతున్న ఈ ప్రాజెక్ట్ దేశీయ ఏఐ విప్లవానికి సరికొత్త దిశను చూపించనుంది.

## ఆఫ్ఘనిస్తాన్‌పై పాకిస్తాన్ వైమానిక దాడులు.. 11 మంది పిల్లలతో సహా 13 మంది మృతి!



**న్యూస్ డెస్క్,10 జూన్ (బిఎన్ఎస్):** ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ మధ్య సరిహద్దు వివాదాల నేపథ్యంలో మరోసారి ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఆఫ్ఘనిస్తాన్ భూభాగంపై పాకిస్తాన్ సైన్యం సరిహద్దు దాటి వైమానిక దాడులకు పాల్పడిందని ఆఫ్ఘన్ ప్రభుత్వం సంచలన ఆరోపణలు చేసింది. అసోసియేటెడ్ ప్రెస్ నివేదికల ప్రకారం.. ఈ దారుణ దాడిలో కనీసం 13 మంది పౌరులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఇటీవల కాలంలో ఇరు దేశాల మధ్య జరిగిన అత్యంత ఘోరమైన ఘర్షణల్లో ఇది ఒకటిగా నిలిచింది.

సాధారణ పౌరులే లక్ష్యంగా బాంబుల వర్షం

పాకిస్తాన్ సైన్యం మరోసారి ఆఫ్ఘనిస్తాన్ వైమానిక పరిధిని ఉల్లంఘించిందని, సరిహద్దుకు సమీపంలోని కునార్, ఖోస్ట్, పక్తికా ప్రాంతాల్లోని సామాన్య పౌరుల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని బాంబుల వర్షం కురిపించిందని ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వ అధికారిక ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ క్షిపణి దాడుల ధాటికి ఇళ్లు ధ్వంసమై 11 మంది అమాయక పిల్లలు, ఒక మహిళ, ఒక వృద్ధుడు మరణించారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి చివర్లో ఇరు దేశాల మధ్య జరిగిన ఘర్షణల తర్వాత సరిహద్దు కొంతకాలంగా ప్రశాంతంగా ఉన్నప్పటికీ, తాజా దాడితో మళ్లీ యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ ఏడాది మొదటి మూడు నెలల్లోనే ఇరు దేశాల ఘర్షణల వల్ల 372 మంది ఆఫ్ఘన్ పౌరులు మరణించగా, 397 మంది గాయపడ్డారని ఐక్యరాజ్యసమితి గత నెల విడుదల చేసిన నివేదికలో పేర్కొనడం గమనార్హం.

# అమరావతికి కేంద్రం వరాలు

## రూ.2534 కోట్లతో సెంట్రల్ సెక్రటేరియట్.. కేబినెట్ ఆమోదం



**న్యూస్ డెస్క్,10 జూన్ (బిఎన్ఎస్):** ఏపీ రాజధాని అమరావతికి కేంద్ర ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. రాజధాని అమరావతికి కీలక ప్రాజెక్టులను ప్రకటించింది. రూ. 2,534 కోట్లతో అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్, జీపీఆర్ఏ ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటి నిర్మాణం కోసం సీపీడబ్ల్యూడీ కేంద్ర మంత్రివర్గానికి ప్రతిపాదనలు పంపగా.. బుధవారం జరిగిన కేబినెట్ భేటీలో ఇందుకు ఆమోదం లభించింది. ఇందులో భాగంగా రూ.1,299.08 కోట్లతో కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ కాంప్లెక్స్, రూ.1,234.91 కోట్లతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం నివాస సముదాయం (జనరల్ పూల్ రెసిడెన్షియల్ అకామిడేషన్ కాంప్లెక్స్) నిర్మించనున్నారు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు అన్నీ కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ భవనంలో కొలువుదీరనున్నాయి. అలాగే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం మల్టీస్టోరేజ్ నివాసాలు నిర్మించనున్నారు.

మరోవైపు అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్ ప్రాజెక్టు కోసం 22.53 ఎకరాలను సీఆర్‌డీఏ ఇప్పటికే కేటాయించింది. 5.53 ఎకరాల్లో కామన్ సెంట్రల్ సెక్రటేరియట్, 17 ఎకరాల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల నివాస సముదాయం నిర్మించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. వీటి నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే డీపీఆర్ కూడా పూర్తి అయ్యింది. మరోవైపు అమరావతిలో ఇప్పటికే పలు కేంద్ర ప్రభుత్వ విభాగాలు, వాటి అనుబంధ సంస్థలు పనిచేస్తున్నాయి. ప్రస్తుతం ఇవన్నీ అద్దె భవనాల్లో నడుస్తుండగా సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణం పూర్తి అయితే ఇవన్నీ కూడా సెక్రటేరియట్ కాంప్లెక్స్ భవనంలోకి మారనున్నాయి.

సెంట్రల్ సెక్రటేరియట్ ప్రాజెక్టును పర్యావరణ హితంగా.. గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలతో నిర్మించనున్నారు. ఐకానిక్ డిజైన్‌తో ఈ ప్రాజెక్టును నిర్మించనున్నారు. అత్యాధునిక మౌలిక సదుపాయాలు, సెంట్రలైజ్డ్ ఎయిర్ కండిషనింగ్, కాన్ఫరెన్స్ హాల్స్ , పార్కింగ్ సౌకర్యాలు కల్పించనున్నారు.. మొత్తంగా సెంట్రల్ సెక్రటేరియట్ భవనం రాజధాని అమరావతికి ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే ప్రభుత్వ విభాగాలు అన్నీ ఒకేచోటకు చేరటం ద్వారా పాలనలో వేగం పెరగడంతో పాటు, అన్ని సేవలూ కూడా ప్రజలకు ఒకే చోట లభిస్తాయని అధికారులు చెప్తున్నారు. కేంద్ర కేబినెట్ ఆమోదం లభించటంతో ఇప్పుడు ఈ ప్రాజెక్టుల నిర్మాణంలో వేగం పెరగనుంది.

# ఆర్డీవో కి అభినందనలు తెలిపిన కొత్తపేట టిడిపి నాయకులు



కొత్తపేట (బిఎన్ఎస్) జూన్ 10: కొత్తపేట ఆర్డిఓ గా నియమితులై పదవి బాధ్యతలు చేపట్టిన కొత్తపేట ఆర్డిఓ జీవివి సత్యనారాయణ ను కొత్తపేట టిడిపి నాయకులు స్థానిక ఆర్డిఓ కార్యాలయంల లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయనకు సాలువ కప్పి సత్కరించారు.

ఎన్నికల సమయంలో ఆర్డిఓ సత్యనారాయణ గతంలో కొత్తపేట ఆర్డీవో గా పని చేశారు.అందరికీ పరిచయస్తులయిన ఆయన తిరిగి మరల కొత్తపేట బదిలీపై రావడంతో టిడిపి నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాసరావు, ధర్నాల రామకృష్ణ మిద్దె ఆదినారాయణ, సిద్ధం శెట్టి సత్యనారాయణ, గుబ్బల మూర్తి తదితరులు ఆర్డీవో కి అభినందనలు తెలిపారు..

### రామాలయం సెంటర్లో రాములవారిని దర్శించుకున్న

# రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి

## సీతారాముల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి.



రాజమహేంద్రవరం, (బిఎన్ఎస్) జూన్ 10: భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 సంవత్సరాల పాలన విజయవంతంగా పూర్తయిన సందర్భంగా రాజమహేంద్రవరం ఏవీ ఏ రోడ్డు, శ్యామలనగర్ రామాలయం సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ సీతారాముల ఆలయంలో రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎంపీ పురందేశ్వరికి మర్యాదపూర్వకంగా బొకే అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆలయ విశిష్టతను వివరిస్తూ, ఈ దేవాలయం 1974 సంవత్సరంలో నిర్మించబడిందని కమిటీ సభ్యులు తెలిపారు.

# కడప క్రికెట్ టోర్నీలో ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరిచిన "అడబాల"




ఆలమూరు(బిఎన్ఎస్ )జూన్ 10: ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ ఇంటర్ సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్లో అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చెముడులంక గ్రామానికి చెందిన అడబాల శ్రీ రామకృష్ణ ఆల్ రౌండ్ చాంపియన్ గా నిలిచారు. కడపలో ఈనెల 4న ప్రారంభమైన ఈ టోర్నమెంట్ కు రాష్ట్ర వ్యాప్తంగా 40 జట్లు పాల్గొన్నాయి. బుధవారం జరిగిన ఫైనల్ లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రాజమండ్రి జట్టు-విశాఖ జట్టు తలబడ్డాయి. చివరికి రాజమండ్రి జట్టు విజయం సాధించింది. అడబాల బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి మొదటి టీమ్ పై మాన్ అఫ్ ది మ్యాచ్ బహుమతిని అందుకున్నారు. ఈ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉన్న రాజమహేంద్రవరం విద్యుత్ శాఖ ఎస్సీ తిలక్ కుమార్ ప్రోత్సాహంతో ఈ జట్టు విజేతగా నిలిచింది. ప్రస్తుతం కడియం మండలం దుళ్ల విద్యుత్ లైన్ మెన్ గా పనిచేస్తున్న అడబాల జట్టు విజయానికి కీలక పాత్ర పోషించడంపై తిలక్ కుమార్ తో పాటు కెప్టెన్ బజ్జి వాసు టీం ప్లేయర్స్ పలువురు విద్యుత్ శాఖ అధికారులు అభినందించారు.ఇదిలా ఉండగా ఈ జట్టు ఇప్పటి వరకు తొమ్మిది సార్లు చాంపియన్ గా నిలిచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది.ఇప్పటి వరకూ రాష్ట్రంలో ఏ జట్టూ ఇన్ని సార్లు టోర్నమెంట్ విజేతగా లేక పోవడం విశేషం.

# సీఎం ప్రారంభించపోయే నిర్మాణానికి కలెక్టర్ పరిశీలన



కాకినాడ,(బిఎన్ఎస్), జూన్ 10: ప్రభుత్వాసుపత్రిలో సుమారు 62కోట్ల వ్యయంతో నిర్మించిన తల్లి పిల్లల ఆసుపత్రి విభాగంను ఈనెల 18వ తేదీన సీఎం చంద్రబాబు ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. బుధవారం ఈ విభాగంని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనుల తీరును కాంట్రాక్టర్ చోడే సురేష్‌ను అడిగి తెలుసుకున్నారు. సురేష్ కలెక్టర్ అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. మరొక్కసారి తాను పరిశీలిస్తానని కలెక్టర్ అక్కడి అధికారులకు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, ఆసుపత్రి ఇంచార్జ్ సూపరింటెండెంట్ పి శ్రీనివాసన్, కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లిబాబు, కార్పొరేషన్ డిసిపి కె కృష్ణారావు, ఏపీ ఎస్ఎమ్ఐడిసిడి ఎంఎస్ చక్రవర్తి, కాకినాడ అర్బన్ తహసీల్దార్ వి జితేంద్ర, ఎంహెచ్వో దళే పృథ్వి చరణ్, విశ్రాంత వైద్యుడు ఎస్వి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ




విశాఖ జిల్లా భీమునిపట్నం నియోజకవర్గం భీమునిపట్నం మండలం అమనాం రెవెన్యూ గ్రామంలో మీ భూమి-మీ హక్కు కార్యక్రమలో భాగంగా రైతులకు రాజముద్ర కలిగిన పట్టాదారు పాసు పుస్తకాలను మంగళవారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పంపిణీ చేశారు. ఎంపీడీవో, గ్రామ ప్రత్యేక అధికారి కెవి. నరసింహారావు అధ్యక్షతన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరై రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. అమనాం గ్రామ రెవిన్యూ పరిధిలో 508 మంది రైతులకు పాసు పుస్తకాల జాబితా ఉన్నతాధికారులుకు పంపించారన్నారు.వీరిలో 405 మందికి ఇవాళ పాసు పుస్తకాలను పంపిణీ చేసామన్నారు.103 పాసుపుస్తకాలు వివిధ కారణాలతో పెండింగ్ లో ఉన్నాయన్నారు.వీరిలో 43 మంది మృతిచెందగా,44 మ్యుటేషన్ ప్రక్రియ,మరో 11పోటోల మార్పు లు చేయాల్సిఉందన్నారు. రీ సర్వేలో రాజముద్ర కలిపిన పాస్ పుస్తకాల్లో ప్రింటింగ్, మ్యుటేషన్ టైపింగ్ (క్లరికల్ మిస్టేక్ ) తప్పిదాలను సరిదిద్దుకునే అవకాశం కల్పించామన్నారు. ఈ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతోందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా 50 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన సామాజిక భవనం,సిసి రహదారిని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చేతులమీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ విజయబాబు, తెదేపా మండల పార్టీ అధ్యక్షులు సరగడ అప్పారావు, జడ్పిటిసి వెంకటప్పుడు, తెదేపా సీనియర్ నాయకులు, దంతులూరి నృసింహ సత్యనారాయణ రాజు, తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షులు కంబపు జశివకుమార్, జనసేన మండల పార్టీ అధ్యక్షులు నక్కా శ్రీధర్ , తదితరులు పాల్గొన్నారు.

# దూడల పెంచలయ్య ఆధ్వర్యంలో ప్రధానమంత్రి పేరు మీద ప్రత్యేక పూజలు



నెల్లూరు జిల్లా రాపూరు (బిఎన్ఎస్):- మన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రధాని మంత్రి బాధ్యతలు చేపట్టి 12 సంవత్సరాల పూర్తి అయిన సందర్భంగా వెంకటగిరి నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ సమన్వయకర్త యస్.యస్.ఆర్.నాయుడు ఆదేశాల మేరకు రాపూరు మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు దూడల పెంచలయ్య ఆధ్వర్యంలో రాపూరు పట్టణ సమీపంలో ఉన్న మద్దెలమడుగు సెంటర్లో శ్రీశ్రీశ్రీ మహావిష్ణువు అయ్యప్పస్వామి స్వామి దేవస్థానంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పేరు మీద ఆయన ఆయు ఆరోగ్యాలతో మన దేశాన్ని ఇంకా అభివృద్ధి పదంలో నడిపి ప్రపంచ పటంలో భారత దేశం ప్రత్యేకంగా నిలపాలని ఆయన పేరు మీద అర్చన చేయించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా రాపూరు మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు దూడల పెంచలయ్య మాట్లాడుతూ ఇప్పుడు భారతదేశం ప్రజాస్వామ్య తల్లి అని నరేంద్ర మోడీ అంతర్జాతీయ వేదికలపై చాటి చెపుతున్నారు అని సంక్షేమ పథకాలు కింద 81కోట్ల మందికి ఉచిత రేషన్ బియ్యం, ప్రధాన మంత్రి ఆవాస యోజన కింద 4కోట్ల మందికి ఇళ్ళు,ఉజ్వల యోజన కింద10.5కోట్ల మందికి ఉచిత గ్యాస్ కనెక్షన్లు,12కోట్ల మందికి మరుగుదొడ్లు, 4.3లక్షల కోట్ల రూపాయల లబ్ధి దారుల ఖాతాలో జమ,అదేవిధంగా ఆసియా కండంలోని అతి పెద్ద డైరెక్షనల్ టన్నెల్ జోజిల సొరంగం మానవ నిర్మిత అద్భుతం కస్మిర్ నుండి లడక్ ను అనుసంధానం, ఇంకా మారెన్నో గొప్ప పనులు మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేశారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మండల సెక్రటరీ మనుబోలు శివ ప్రసాద్, జోరేపల్లి బూత్ అధ్యక్షులు వంగపాటి పెంచలయ్య,మండల ఉపాధ్యాక్షులు కరిపం సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులపై రాళ్ల దాడి... గాలిలోకి కాల్పులు

### 209 కేజీల గంజాయి స్వాధీనం.
### కారు, రెండు బైకులు సీజ్ నలుగురు స్మగ్లర్లు అరెస్ట్

చింతపల్లి బిఎన్ఎస్ న్యూస్:- అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీలో గంజాయి అక్రమ రవాణా మరోసారి కలకలం రేపింది. గంజాయి తరలిస్తున్న స్మగ్లర్లు పోలీసులపై రాళ్లతో దాడికి పాల్పడగా, ఆత్మరక్షణ కోసం పోలీసులు గాలిలోకి రెండు రౌండ్లు కాల్పులు జరిపిన ఘటన చింతపల్లి మండలంలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఈ ఘటనలో 209 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు, రాజస్థాన్‌కు చెందిన నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. అక్రమ రవాణాకు ఉపయోగించిన ఒక కారు, రెండు మోటార్‌సైకిళ్లను సీజ్ చేశారు.

పోలీసుల కథనం ప్రకారం.. లోతుగడ్డ పంచాయతీ పరిధిలోని రామారావుపాలెం సమీపంలో భారీ మొత్తంలో గంజాయి తరలింపు జరుగుతోందని అన్నవరం ఎస్ఐ సాయిరాంకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఆయన సిబ్బందితో కలిసి లోతుగడ్డ వంతెన వద్ద మాటువేసి వాహనాల తనిఖీలు చేపట్టారు.

ఈ క్రమంలో కోరుకొండ వైపు నుంచి వస్తున్న ఒక కారు, రెండు మోటార్‌సైకిళ్లను నిలిపివేయడానికి పోలీసులు ప్రయత్నించారు. అయితే వాహనాల్లో ఉన్న వ్యక్తులు వేగంగా తప్పించుకునే ప్రయత్నం చేశారు. వారిని పోలీసులు వెంటాడగా, స్మగ్లర్లు ఒక్కసారిగా రాళ్లతో దాడికి దిగారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆత్మరక్షణ చర్యల్లో భాగంగా ఎస్ఐ సాయిరాం గాలిలోకి రెండు రౌండ్లు కాల్పులు జరిపారు.



అనంతరం పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

నిందితుల వద్ద నుంచి 209 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన వారంతా రాజస్థాన్‌కు చెందిన వారిగా గుర్తించారు. గత కొంతకాలంగా అల్లూరి ఏజెన్సీ ప్రాంతంలో బస చేస్తూ స్థానికంగా గంజాయిని కొనుగోలు చేసి రాజస్థాన్‌తో పాటు ఉత్తర భారత రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు సమాచారం.

నిందితుల వెనుక మరింత పెద్ద స్మగ్లింగ్ ముఠా పనిచేస్తోందనే అనుమానంతో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఒకప్పుడు గంజాయి అక్రమ రవాణాకు కేంద్రంగా నిలిచిన ఏజెన్సీ ప్రాంతంలో పోలీసుల నిరంతర నిఘా, ప్రత్యేక దాడుల కారణంగా రవాణా గణనీయంగా తగ్గినప్పటికీ, స్మగ్లర్లు కొత్త మార్గాలను అన్వేషిస్తూ మళ్లీ చురుకుగా మారుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

ఈ ఘటనతో ఏజెన్సీలో గంజాయి ముఠాల కార్యకలాపాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. నిందితులపై కేసు నమోదు చేసిన పోలీసులు, గంజాయి సరఫరా మూలాలు, స్థానిక సహకారులు, కొనుగోలుదారుల వివరాలపై లోతుగా విచారణ చేపట్టారు.

# పాయకరావుపేట అభివృద్ధే లక్ష్యం.. రూ.1,150 కోట్లతో సంక్షేమం, మౌలిక సదుపాయాల విస్తరణ

- ఉపమాకలో పుష్కరిణి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన హోం మంత్రి అనిత
- రెండేళ్ల ప్రగతిని ఫొటోలతో వివరించిన మంత్రి..
- రాబోయే మూడేళ్లలో మరింత అభివృద్ధికి హామీ

అనకాపల్లి జిల్లా,జూన్ 10 పాయకరావుపేట : పాయకరావుపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.అనకాపల్లి జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఆమె ముందుగా ఉపమాకలోని శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం చేయగా, స్వామివారి తీర్థప్రసాదాలు,చిత్రపటాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా ఏషియన్ పెయింట్స్ సహకారంతో చేపట్టనున్న ఉపమాక శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పుష్కరిణి అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎస్.రాయవరం మండలం పెదగుమ్ములూరులో చెరువు అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించారు.

తదనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో గత రెండేళ్లలో పాయకరావుపేట నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ఫొటోలతో వివరిస్తూ ప్రజల ముందుంచారు.ఈ రెండు సంవత్సరాల కాలంలో సుమారు రూ.1,150 కోట్ల విలువైన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసినట్లు తెలిపారు.సంక్షేమ పథకాలతో ప్రజలకు అండ'తల్లికి వందనం'పథకం ద్వారా నియోజక వర్గంలోని తల్లుల ఖాతాల్లో రూ.49 కోట్లు జమ చేసినట్లు తెలిపారు.ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కింద అవ్వలు,తాతలు, వితంతువులు, మత్స్యకారులు, దివ్యాంగుల కోసం రూ.501 కోట్లు ఖర్చు చేశామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు రూ.73 కోట్లు, మత్స్యకారుల సంక్షేమానికి రూ.32 కోట్లు అందించినట్లు చెప్పారు.ఆటో డ్రైవర్లకు రూ.2.55 కోట్లు, సీఎంఆర్ఎఫ్ ద్వారా అత్యవసర వైద్య సహాయంగా రూ.2.81 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.వేగంగా మౌలిక వసతుల అభివృద్ధి

పంచాయతీరాజ్ శాఖ ద్వారా నాలుగు మండలాల పరిధిలో 871 పనులకు రూ.118 కోట్లు మంజూరు చేసి 172 కిలోమీటర్ల రహదారులను నిర్మించినట్లు తెలిపారు.ఆర్అండ్బీ శాఖ ఆధ్వర్యంలో 36 పనుల కింద




137 కిలోమీటర్ల రోడ్లను రూ.130 కోట్లతో అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు.జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందించేందుకు రూ.66 కోట్లతో 244 పనులు చేపట్టామని చెప్పారు.సాగునీటి రంగంలో 92 పనులకు రూ.16 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు.పేదలకు సౌర విద్యుత్.. యువతకు నైపుణ్య శిక్షణ పీఎం సూర్యఘర్ పథకం కింద 2,513 పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉచిత సౌర విద్యుత్ అందించేందుకు రూ.18 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు.యువత ఉపాధి అవకాశాల కోసం నక్కపల్లిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మెగా డీఎస్సీ ద్వారా నియోజకవర్గానికి చెందిన 147 మంది ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం సంతోషకరమన్నారు.పెట్టుబడులు -- ఉపాధికి పెద్దపీట

లక్షా 35 వేల కోట్ల పెట్టుబడితో ఏఎన్ఎంఎస్ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన జరిగిందని,దీనివల్ల సుమారు 55 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.4,500 ఎకరాల్లో రూ.11 వేల కోట్ల పెట్టుబడితో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు కానుండగా, 70కిపైగా ఫార్మా కంపెనీలు స్థాపనకు ముందుకొస్తున్నాయని వివరించారు.ప్రత్యేక నిధులతో కీలక పనులు రాజయ్యపేట,దొండవాకలో రూ.48 కోట్లకు పైగా వ్యయంతో రెండు ప్రధాన ఫిషరీస్ జెట్టీలు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు.సోముదేవుపల్లి వద్ద వరహానది ఉధృతి నుంచి గ్రామాలు,పంట పొలాలను రక్షించేందుకు రూ.9.95 కోట్లతో రక్షణ గోడ నిర్మిస్తున్నట్లు చెప్పారు. పందూరు,జల్లూరి వంతెనల నిర్మాణం ద్వారా దశాబ్దాల రవాణా సమస్యలకు పరిష్కారం చూపుతున్నామని పేర్కొన్నారు.ఆధ్యాత్మిక, వైద్య, పరిపాలనా రంగాలకు ప్రాధాన్యం ఉపమాక శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.5.46 కోట్లు కేటాయించి పనులు చేపట్టామని తెలిపారు. పాయకరావుపేట పట్టణ ప్రధాన రహదారి అభివృద్ధికి రూ.3.5 కోట్లు, అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు రూ.61 లక్షలు వెచ్చించినట్లు చెప్పారు. పెనుగొల్లులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధునీకరణకు రూ.54.70 లక్షలు ఖర్చు చేసినట్లు వెల్లడించారు.అడ్డురోడ్డులో కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు మరింత చేరువ చేశామని, నక్కపల్లిలో సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరగలేదని, తమ ప్రభుత్వం వచ్చిన తరువాతే పాయకరావుపేటలో సమగ్ర అభివృద్ధి ప్రారంభమైందని పేర్కొన్నారు.రాబోయే మూడేళ్లలో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి, పర్యాటక రంగంలోనూ ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే తన ధ్యేయమని హోం మంత్రి అనిత స్పష్టం చేశారు.

# మోసపూరితమైన రిజిస్ట్రేషన్ లపై కఠినంగా వ్యవహరిస్తా.

## కమిషనర్. అంబేద్కర్



అమరావతి, జూన్ 10(బిఎన్ఎస్): భూకబ్జాలకు పాల్పడాలనే కుట్రతో మోసపూరితమైన రిజిస్ట్రేషన్లు జరిపించిన వారికి చేసిన వారికి కూడా శిక్ష తప్పదని, ఆంధ్రప్రదేశ్ స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ అంబేద్కర్ హెచ్చరికలు జారీ చేశారు. రిజిస్ట్రేషన్ శాఖ లో కొందరు సబ్ రిజిస్ట్రార్లు, అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడి పలు వివాదాలకు కారణం అవుతున్నారని, అటువంటి వారిని ఉపేక్షించేది లేదని అన్నారు. మోసపూరితమైన రిజిస్ట్రేషన్ లపై ఏపీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను పాటిస్తూ, సర్క్యులర్ జారీ చేశారు. మోసపూరితంగా రిజిస్ట్రేషన్లు జరిగినట్లు స్థలము లేక పొలము యొక్క యజమానుల దృష్టికి వస్తే, వెంటనే జిల్లా రిజిస్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని, సంబంధిత జిల్లా రిజిస్టర్లు రిజిస్ట్రేషన్ చట్టం 1908 ప్రకారం, బాధితులకు అండగా నిలిచి, ప్రాసిక్యూషన్ లాంచ్ చేసి పోలీస్ కేసులు నమోదు చేయించాలని, కమిషనర్ అంబేద్కర్ ఆదేశాలు జారీ చేశారు.



# సైబర్‌టవర్స్‌కు చేరువలో..

- 15 ఎకరాల ప్రభుత్వ భూమికి హైడ్రా ఫెన్సింగ్
- హైకోర్టు తీర్పుమేరకు చర్యలు తీసుకున్న హైడ్రా
- రూ. 3 వేల కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

హైదరాబాద్, జూన్ 10: మాధాపూర్ సైబర్‌టవర్స్‌కు చేరువలో 15 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. దాదాపు 3 వేల కోట్ల విలువైన భూమి చుట్టూ బుధవారం ఫెన్సింగ్ వేసింది. హైకోర్టు తీర్పు మేరకు హైడ్రా ఈ చర్యలు తీసుకుంది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజ్‌లోని 41/12, 13, 14 సర్వే నంబర్లలో మొత్తం 15 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అయితే ఈ భూమి తమదంటూ ఇట్టినా ప్రాపర్టీస్ సంస్థ క్లైమ్ చేస్తూ వస్తోంది. ఆ భూములను ఖాళీ చేయాలని కోరుతూ 2016లో టీజీఐఐసీ వాళ్లు ఇట్టినా ప్రాపర్టీస్ సంస్థకు నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను సవాల్ చేస్తూ ఇట్టినా సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టి తీర్పు వెలవరిస్తూ.. దశాబ్దం నాటి వివాదానికి తెరదించారు. మాజీ సైనికుల కోటా కింద ప్రభుత్వం 1963లో కేటియించినట్టు ఎక్కడా ఆధారాలు లేవని.. పిటిషనర్ సమర్పించిన పట్టా పత్రాలు నకిలీవని రెవన్యూ అధికారులు ఆధారాలతో కోర్టుకు నివేదించారు. అప్పటి రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యలయం 1978లో ఏర్పాటు కాగా.. ఆ కార్యలయం పేరుతో 1972, 1973 సంవత్సరాలలో పట్టా పత్రాలు ఎలా వస్తాయని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. ఆర్‌వోఆర్ చట్ట ప్రకారం ప్రొసీడింగ్స్‌ను తహసీల్దార్ జారీ చేయాల్సి ఉండగా.. ఈ కేసులో రికార్డింగ్ ఆఫీసర్ యూడీఐఆర్ శేరిలింగంపల్లి మండలం పేరుతో జారీ అయ్యాయని.. ఇవి ఏ చట్టం కింద జారీ అయ్యాయో కూడా తెలియదన్నారు. ప్రొసీడింగ్స్ జారీ చేసిన అధికారి పేరు పి. నరసింహారావు అని ఉందని.. కానీ ఆ పేరుగల అధికారి అక్కడ పని చేసినట్టు రికార్డులు లేవని.. రుజువు చేశారు. ఇలా నకిలీ పత్రాలతో ప్రభుత్వ భూమిని కొట్టేయాలని పిటిషనర్లు ప్రయత్నిస్తున్నారని కోర్టు నిర్ధారించుకుని.. ఆ భూములను రక్షించాలని రెవెన్యూ అదికారులను ఆదేశించింది. రెవెన్యూ అధికారుల విజ్ఞప్తి మేరకు 15 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడుతూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేసింది.

# అమలాపురంలో గోల్డ్ స్కాం కలకలం

**రోడ్డెక్కిన బాధితులు..**

**హామీ ఇచ్చిన**

**యజమాని గైర్హాజరు**



అమలాపురం(బిఎన్ఎస్) జూన్: 10 కోనసీమ జిల్లా అమలాపురంలో గోల్డ్ స్కాం వ్యవహారం మరోసారి ఉద్రిక్తతకు దారితీసింది. పట్టణంలోని సిద్దేశ్వర జ్యువెలరీ సంస్థ సుమారు రూ.5 కోట్ల మేర ఖాతాదారుల డబ్బులు, బంగారం వ్యవహారాల్లో ఇబ్బందులు తలెత్తడంతో బాధితులు ఆందోళన బాట పట్టారు.తమకు న్యాయం చేస్తానని, సమస్యలను పరిష్కరిస్తానని యజమాని హామీ ఇచ్చినప్పటికీ, నిర్ణయించిన రోజున ఆయన అందుబాటులోకి రాకపోవడంతో బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పలువురు బాధితులు రోడ్డుపైకి వచ్చి నిరసన చేపట్టారు.

తాము కష్టపడి కూడబెట్టిన సొమ్మును జ్యువెలరీ సంస్థలో పెట్టుబడిగా పెట్టామని, ఇప్పుడు తమ డబ్బులు తిరిగి వస్తాయో లేదో అన్న ఆందోళనలో ఉన్నామని బాధితులు వాపోయారు. యజమాని వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.సంఘటన సమాచారం అందుకున్న పోలీసులు పరిస్థితిని పరిశీలించి బాధితులతో మాట్లాడినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై అధికారుల జోక్యంతో త్వరితగతిన పరిష్కారం చూపాలని బాధితులు కోరుతున్నారు.ఈ గోల్డ్ స్కాం వ్యవహారం అమలాపురంలో ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# జనగామ 3వ వార్డు అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

**-మంత్రి పొంగులేటికి కౌన్సిలర్ జ్యోతి వినతి**

**బిఎన్ఎస్ న్యూస్ హైదరాబాద్, జూన్ 10**



జనగామ పట్టణంలోని 3వ వార్డు అభివృద్ధికి ప్రత్యేక స్పెషల్ ప్యాకేజీ ప్రకటించి నిధులు మంజూరు చేయాలని 3వ వార్డు కౌన్సిలర్ బూడిది జ్యోతి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిను కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలిసి వార్డు సమస్యలు, అభివృద్ధి అవసరాలపై మెమోరాండం సమర్పించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ జ్యోతి మాట్లాడుతూ జనగామ పట్టణంలోని 3వ వార్డు పూర్తిగా లోతట్టు ప్రాంతంగా ఉండటంతో గవర్నమెంట్ హాస్పిటల్, బాణాపురం, రైల్వే స్టేషన్, పాత బీట్ బజార్, నాగులకుంట, నెహ్రూ పార్క్, కురుమవాడ, సాయినగర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే మురుగు, వర్షపు నీరు ఈ వార్డు గుండా ప్రవహిస్తోందని వివరించారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు ఇండ్ల మధ్య నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.హైదరాబాద్ రోడ్డు, సూర్యాపేట ప్రధాన రహదారి, బస్టాండ్, కలెక్టర్ కార్యాలయానికి సమీపంలో ఉన్నప్పటికీ అంతర్గతంగా అనేక సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారని పేర్కొన్నారు. వర్షాకాలంలో బురద, పాములు, విషపురుగులు, తేళ్ల బెడద అధికంగా ఉంటోందని, సమస్యల పరిష్కారానికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, ప్రధాన కూడళ్లలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు.అలాగే వార్డును మోడల్ కాలనీగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.5 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.కలెక్టర్ కార్యాలయానికి ఆనుకుని ఉన్న గార్లకుంట ప్రభుత్వ శిఖం భూమిలో ముండ్ల పొదలు, చెట్లు పెరిగి పాములు, పందులకు ఆవాసంగా మారిందని, కుంట కొంత మేర ఆక్రమణలకు గురైందని తెలిపారు. ప్రజల అవసరాల దృష్ట్యా గార్లకుంటను పార్కుగా అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ద్వారా నివేదిక తెప్పించుకుని గార్లకుంటను పార్కుగా అభివృద్ధి చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు.అలాగే 3వ వార్డు అభివృద్ధికి అవసరమైన నిధుల కేటాయింపుపై కూడా సానుకూలంగా స్పందించి సహకరిస్తామని హామీ ఇచ్చారు.మంత్రి ని కలిసిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, సుంచు విజేందర్, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు భానోతు ధర్మభిక్షం నాయక్, సీపీఎం శాఖ కార్యదర్శి గుండు శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల నుంచి రక్షణ కోసం నిరుపేద కుటుంబానికి తార్పాలిన్ కవర్ ఏర్పాటు చేసిన వాసవి ఫౌండేషన్

**బిఎన్ఎస్ న్యూస్**
**గానుగుపహాడ్, జూన్ 10**



జనగామ మండలం గానుగుపహాడ్ గ్రామానికి చెందిన గుర్రం సాయమ్మ కుటుంబానికి వర్షాకాలంలో ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించిన వాసవి ఫౌండేషన్ సభ్యులు మానవతా దృక్పథంతో ముందుకొచ్చి ఇంటి పైకప్పుపై తార్పాలిన్ కవర్ ఏర్పాటు చేశారు.గుర్రం సాయమ్మకు ఇద్దరు కుమారులు ఉండగా, పెద్ద కుమారుడు పరుశురాములు మతిస్థిమితం కోల్పోయి ఉన్నారు. చిన్న కుమారుడు కనకయ్య అనారోగ్యంతో మంచాన పడ్డారు. తొమ్మిది సంవత్సరాల క్రితం కనకయ్య భార్య మరణించడంతో ఆయన ఇద్దరు చిన్నారుల బాధ్యతలను సాయమ్మే భుజాన వేసుకుని పెంచుతున్నారు. ప్రస్తుతం కుటుంబం సాయమ్మకు మరియు కుమారుడికి వచ్చే పెన్షన్‌పైనే ఆధారపడి జీవనం సాగిస్తోంది.ఇంటి పైకప్పు పూర్తిగా దెబ్బతినడంతో ప్రతి వర్షాకాలంలో వర్షపు నీరు ఇంట్లోకి చేరి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని గుర్తించిన వాసవి ఫౌండేషన్ సభ్యులు తాత్కాలిక ఉపశమనంగా తార్పాలిన్ కవర్ ఏర్పాటు చేసి కుటుంబానికి అండగా నిలిచారు.అయితే ఇది శాశ్వత పరిష్కారం కాదని, ఈ నిరుపేద కుటుంబానికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రజాప్రతినిధులు సహకరించి ఇంటికి రేకులు లేదా శాశ్వత పైకప్పు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో వాసవి ఫౌండేషన్ సభ్యులు మద్దోజు రవితేజ, నీల పవన్ కళ్యాణ్, కొడారి మహేందర్, పిట్టల రాజేష్, పొలాల హర్షవర్ధన్, పొలాల వెంకటేష్, ఎం.డి. సమీర్, ఎం.డి. జాంగిర్, మహేష్, నరేష్, గుర్రం శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

# తమ్మడపల్లి (జి) ఉపకేంద్రంలో వైద్య సేవలు అందించాలి

**కలెక్టర్ కార్యాలయంలో ఏవో, డీఎంహెచ్‌వోలకు సీపీఐ వినతి**

**బిఎన్ఎస్ న్యూస్ జఫర్‌గడ్, జూన్ 10**



మండలంలోని తమ్మడపల్లి (జి) గ్రామ ఆరోగ్య ఉపకేంద్రంలో వెంటనే వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ సీపీఐ నాయకులు బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పరిపాలన అధికారి (ఏవో), జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌వో)లకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యవర్గ సభ్యుడు, గ్రామ కార్యదర్శి వడ్లకొండ సుధాకర్ మాట్లాడుతూ గ్రామీణ పేదలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశంతో లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన తమ్మడపల్లి (జి) ఆరోగ్య ఉపకేంద్రంలో ఇప్పటికీ వైద్య సేవలు అందకపోవడం విచారకరమన్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వారు సానుకూలంగా స్పందించి త్వరలోనే అవసరమైన చర్యలు తీసుకొని వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలకు దూరమవుతున్నారని విమర్శించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, తమ్మడపల్లి (జి) ఉపకేంద్రంలో వైద్య సిబ్బందిని నియమించి సేవలు అందించడంలో విఫలమైందని ఆరోపించారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన వైద్య సేవలు అందకపోవడంతో పేదలు ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని, అక్కడ భారీ వైద్య ఖర్చులతో కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.వైద్య ఖర్చుల భారం వల్ల అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి వైద్య సేవలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం సంతోషకరమని, త్వరలోనే ప్రజలకు ఉపశమనం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల, గ్రామ నాయకులు వేల్పుల పెదరాములు, ఎండీ యాకూబ్ పాషా, రైతు సంఘం మండల అధ్యక్షుడు అన్నపు అజయ్, నక్క బిక్షపతి, అన్నపు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# సిపిజెట్-2026 దరఖాస్తు గడువు పొడిగించాలి: స్వేరో స్టూడెంట్స్ యూనియన్

**బిఎన్ఎస్ న్యూస్**
**హనుమకొండ, జూన్ 10**




తెలంగాణ రాష్ట్ర సిపిజెట్-2026-27 ప్రవేశ పరీక్ష దరఖాస్తుల గడువును తక్షణమే పొడిగించాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ డిమాండ్ చేసింది.ఈ మేరకు బుధవారం కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంకు యూనియన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ మాట్లాడుతూ..సిపిజెట్-2026-27 దరఖాస్తుల సమర్పణకు ఈరోజుతో గడువు ముగియనున్న నేపథ్యంలో అనేక మంది బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు, సాంకేతిక సమస్యలు మరియు ఇతర కారణాల వల్ల ఇంకా దరఖాస్తు చేసుకోలేకపోయారని తెలిపారు.ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో ఉన్న విద్యార్థులకు అవకాశం కల్పించేలా దరఖాస్తు గడువును మరికొన్ని రోజులు పొడిగించాలని ఆయన కోరారు.ప్రభుత్వం, ఉన్నత విద్యామండలి మరియు సంబంధిత అధికారులు విద్యార్థుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సిపిజెట్ దరఖాస్తు గడువు పొడిగిస్తే మరింత మంది విద్యార్థులు ఉన్నత విద్యలో చేరే అవకాశం కలుగుతుందని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేసిన అహ్మదీయ ముస్లింలు



**బిఎన్ఎస్ న్యూస్**
**విజయవాడ, జూన్ 10**

"సర్వ మానవులు ఒకే కుటుంబం" అనే సందేశంతో అంతర్జాతీయ అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ ఆధ్వర్యంలో విజయవాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ వృద్ధుల శాఖ జాతీయ కార్యాలయ ప్రతినిధి ఖాలిద్ అలాద్దీన్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా 200కు పైగా దేశాల్లో కమ్యూనిటీ అధినేత హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ నాయకత్వంలో "అందరిని ప్రేమించు -- ఎవ్వరినీ ద్వేషించకు" అనే నినాదంతో శాంతి, మానవతా సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు.మహా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) బోధించిన "సర్వ మానవులు అల్లాహ్ కుటుంబమే" అనే సందేశాన్ని ఆదర్శంగా తీసుకుని, ప్రపంచంలో ఎక్కడైనా విపత్తులు, ఆపదలు సంభవించినప్పుడు బాధితులకు సహాయ సహకారాలు అందించడం కమ్యూనిటీ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.అనంతరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆర్ఎంఓ, సూపరింటెండెంట్‌లు అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించారు.ఈ కార్యక్రమంలో అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షులు షేక్ నాగూర్ మీరా వలీ, జిల్లా ఇన్‌ఛార్జి ముహమ్మద్ యాకూబ్ పాషా, ఆంధ్రప్రదేశ్ ప్రజా సంబంధాల కార్యనిర్వాహకులు ముహమ్మద్ జావేద్ అహ్మద్, రసూల్, నవాఫ్ అహ్మద్‌తో పాటు కమ్యూనిటీ వాలంటీర్లు పాల్గొన్నారు.




# వర్ధన్నపేట 11వ డివిజన్ వార్డు సభలో కాంగ్రెస్ నేతలే సొంత ప్రభుత్వాన్ని నిలదీత

**చెత్త, డ్రైనేజీ, నీటి సమస్యలపై అధికారులకు చుక్కలు చూపించిన కాంగ్రెస్ కార్యకర్తలు**



వర్ధన్నపేట, జూన్ 10 (బిఎన్ఎస్ న్యూస్) : వర్ధన్నపేట మున్సిపల్ పట్టణ కేంద్రంలోని 11వ డివిజన్‌లో 99 రోజుల 'పట్టణ ప్రగతి-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా మంగళవారం వార్డు సభ నిర్వహించారు. బీఆర్ఎస్ కౌన్సిలర్ సిలివేరు కుమారస్వామి యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో కాంగ్రెస్ నాయకులే సొంత ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడం చర్చనీయాంశమైంది.మున్సిపల్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీకి చెందినప్పటికీ, వార్డు ప్రజలతో పాటు స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు, ఇతర డివిజన్ల కాంగ్రెస్ నాయకులు సైతం సైడ్ కాలువలను శుభ్రం చేయడం లేదని, వార్డులో చెత్త బండి రావడం లేదని, నల్లా నీళ్లు సరిగా రావడం లేదని మున్సిపల్ అధికారులను నిలదీశారు. ఒక రకంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్నే కాంగ్రెస్ పార్టీ నాయకులే ప్రశ్నించడం గమనార్హం.వర్షాకాలంలో జాగ్రత్తలు: కౌన్సిలర్ కుమారస్వామి

ఈ సందర్భంగా కౌన్సిలర్ సిలివేరు కుమారస్వామి యాదవ్ మాట్లాడుతూ, రానున్న వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతి ఇంటి ముందు చెత్త చెదారం, మురుగు నీరు లేకుండా చూసుకోవాలని సూచించారు. డివిజన్‌లో ఏదైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, రాబోయే జనరల్ బాడీ సమావేశంలో వాటిని ప్రస్తావించి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లపై అధికారుల వివరణ మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ, ఇంకా కొత్త పెన్షన్లు మంజూరు కాలేదని, 2వ విడత ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం రాలేదని తెలిపారు. సమాచారం వచ్చిన వెంటనే అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి ఆఫీసర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ కర్ణాకర్, వార్డు ఆఫీసర్ రితేష్ కుమార్, బిల్ కలెక్టర్ తుమ్మల విజయ్ కుమార్, వీఓ విజయ, ఆశా వర్కర్ స్రవంతి, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.